# 3. సత్యం

అరబీ భాషలో సత్యాన్ని 'అస్ సిద్ఖ్' అంటారు. సత్యం పలికే వాడిని **'అస్ సాదిఖ్'** అంటారు.

నిఘంటువు ప్రకారం సత్యం అంటే: **నిజము.**

**ధర్మ ప్రకారం సత్యం అంటే:** జరిగిన వాస్తవికతను ఎలాంటి మార్పులు చేర్పులు లేకుండా తెలుపడం. ఉదాహరణకు: ఈ రోజు ఆదివారం ఉంటే, ఆది వారం అనే చెప్పాలి. ఒకవేళ సోమవారం అంటే అది అసత్య మైనది, సత్యానికి విరుద్ధమైన వార్త అబద్ధం.

- ఏ మాట పలుకుతామో దానికి అనుగుణంగా మన కర్తవ్యం కూడా అలాగే ఉండాలి. అలాంటి వ్యక్తిని సత్యవంతునిగా పేర్కొంటాము.
- ఒక వ్యక్తి తన నోటితో ఏదైతే పలుకుతాడో, ఆ మాట మేరకే అతని మనసులో కూడా ఉండాలి.
- ఏ పని చేస్తామో, ఆ పని మనసుకు నచ్చినదై ఉండాలి.

ఇలాంటి అనేకమైన వాస్తవాలనే సత్యము, నిజము మరియు యదార్థం అని అంటాము.

## ప్రవక్తలు ఎల్లప్పడు నిజమే పలికేవారు

అల్లాహ్ మరియు అల్లాహ్ ప్రవక్తలు ఎల్లప్పుడు నిజమే పలుకుతారు. వారి ప్రతీ వాక్కు సత్యమైనది. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: "అల్లాహ్ మాటకన్నా ఎవరి మాట నిజమవుతుంది."[1]

ఖుర్ఆన్ గ్రంథం మాత్రమే మార్పులు చేర్పులు లేని నిజమైన గ్రంథం. మరియు ప్రవక్తలందరు ఎల్లప్పుడు సత్యాన్నే పలికేవారు. కనుక అల్లాహ్ వారి గురించి ఖుర్ఆన్ గ్రంథంలో అనేక చోట్ల ఇలా తెలియజేశాడు:

"అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త మనకు వాగ్దానం చేసిన విషయం ఇదే, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త నిజమే పలికారు."[2]

---

*1. (4, సూరతున్ నిసా:122). 2. (33,సూరతుల్ అహ్జాబ్:22)*

అల్లాహ్ ప్రవక్తలు సత్యాన్నే పలికేవారు. కనుక వారి గురించి అల్లాహ్ ఇలా ప్రకటించాడు:

"ఈ గ్రంథంలో ఇబ్రాహీం గాధను ప్రస్తావించు, నిస్సందేహంగా అతను సత్యసంధుడైన వ్యక్తి, ఒక దైవ ప్రవక్త."[2]

"ఈ గ్రంథంలో ఇస్మాయీల్‌ను గురించి ప్రస్తావించు. అతను వాగ్దాన పాలకుడు, సందేశహరుడైన ప్రవక్త."[3]

అతడు అక్కడకు పోయి ఇలా అన్నాడు: "యూసుఫ్, నిలువెల్ల సత్యమైన వాడా! నాకు ఈ స్వప్న ఫలాన్ని తెలుపు."[4]

"ఈ గ్రంథంలో ఇద్రీస్‌ను గురించి ప్రస్తావించు. అతను ఒక నిజాయితీ పరుడైన మనిషి, ఒక ప్రవక్త. మేము అతన్ని ఒక ఉన్నత స్థానానికి లేపాము."[5]

అలాగే మన మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) గురించి మరియు ఆయన జీవిత చరిత్ర గురించి చదివినట్లయితే మక్కా నగరంలో మరియు పూర్తి ప్రపంచంలోనే ఆయన సత్యమూర్తిగా పేరు పొందినవారు.

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: "విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతులకు తోడుగా ఉండండి."[6]

## సత్యం అనే పదాన్ని మూడు రకాలుగా మనం విభజించ వచ్చును

1. ఒక ముస్లిం అల్లాహ్ పట్ల సత్య విధేయుడిగా ఉండాలి.
2. ప్రజతల పట్ల సత్యవంతునిగా మెలగాలి.
3. తన విషయంలో కూడా సత్యానికి అనుగుణంగా ఉండాలి.

---

2. *(19,సూరతు మర్యమ్:41)*
3. *(19, సూరలు మర్యమ్:54)*
4. *(12,సూరతు యూసుఫ్:46)*
5. *(19, సూరతు మర్యహ్:56-57)*
6. *(9,సూరతుతౌబా:119)*

# 1. ఒక ముస్లిం అల్లాహ్ పట్ల సత్య విధేయునిగా ఉండాలి

ప్రతి కార్యంలో అల్లాహ్ ఇష్టాయిష్టాలను గమనించి చిత్తశుద్ధితో ఆరాధనలు చేసేవారిని అల్లాహ్‌కు నిజమైన విధేయులుగా భావించవచ్చు. ఆరాధనలలో ఎలాంటి ప్రదర్శనాబుద్ధి ఉండకూడదు. దానిలో ప్రదర్శనా బుద్ధి కలిగిందంటే అతను ఎంతో కష్టపడి సంపాదించిన పుణ్యాలకు అల్లాహ్ వద్ద ఎలాంటి విలువ ఉండదు. కనుక నిజమైన ముస్లిం ప్రతీ కార్యాన్ని అల్లాహ్ ప్రేమ పొందుటకై చిత్తశుద్ధితో చేయాలి.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఎవరైతే అల్లాహ్ ప్రసన్నత పొందుటకై ప్రజల నుండి అప్రసన్నత కోరుకుంటాడో, అతనికి ప్రజత చెడు నుండి అల్లాహ్ (రక్షణ) కాపాడుతాడు. మరియు ఎవరైతే ప్రజల నుండి ప్రసన్నత పొందుటకై అల్లాహ్ అప్రసన్నత కోరుకుంటాడో, అతను అల్లాహ్ యొక్క అప్రసన్నతను పొందుతాడు. మరియు ప్రజల అప్రసన్నతను కూడా పొందుతాడు."[1]

★ ప్రదర్శనా బుద్ధి కలవారు అల్లాహ్ యొక్క సత్యమైన విధేయులు కారు. వారు ఆరాధనలు చేస్తున్నట్టుగా ఇతరుల ముందు ప్రదర్శన మాత్రమే చేస్తారు. అల్లాహ్ ప్రేమను కాంక్షిస్తూ చెయ్యరు. కనుక ఇలాంటి వారంతా అసత్యవాదులు.

అలాగే బహుదైవారాధకులు నిజమైన దేవుణ్ణి ఆరాధిస్తున్నాం అనుకుంటారు. కాని వారు ఆరాధించేది విగ్రహాలనో లేక సాధువులనో లేక మంత్రగాళ్ళనో తప్ప, నిజమైన దేవుణ్ణి మాత్రం ఆరాధించడం లేదు. కనుక వారు చేసే ఆరాధన విధానం కూడా అసత్యమైనది.

అలాగే వంచకులు చెప్పేది ఒకటయితే చేసేది మరొకటి. అలాంటివారు ప్రదర్శనాబుద్ధితో ఆరాధనలు చేసినప్పటికీ వారికి ఎలాంటి ప్రతిఫలం లభించదు. పైగా వారు పరలోకంలో కఠినమయిన శిక్షలకు గురికాబడతారు.

బిద్అతీలు కూడా అసత్యవాదులు. ఎందుకంటే, వారు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను అనుసరిస్తాము మరియు వారు చెప్పినట్లుగానే విధేయతను పాటిస్తాము అని అంటారు. కాని వారు ప్రవక్త ముహమ్మద్ (స)కు విధేయత చూపకుండా, వారి తాత ముత్తాతల విధానాలకు అనుగుణంగా నడుచుకుంటారు.

హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ జాబిర్ (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు:

“వాక్యాలలో అన్నిటికంటే సత్యమైన వాక్యం అల్లాహ్ గ్రంథం (ఖుర్ఆన్). మరియు మార్గాలన్నిటిలో అతి ఉత్తమమైన మార్గం ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) మార్గం మరియు ఆచారాలలో అతి చెడు ఆచారం క్రొత్త ఆచారాలు, మరియు ప్రతి క్రొత్త ఆచారం బిద్అత్, ప్రతి బిద్అత్ మార్గ విహీనమైనది. మరియు ప్రతి మార్గవిహీనత నరకానికి తీసుకువెళుతుంది.....[1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచిం చారు: ‘నిశ్చయంగా సత్యం మంచికి మార్గం చూపుతుంది. మరియు మంచి స్వర్గానికి మార్గం చూపుతుంది, అలాగే ఆ వ్యక్తి సత్యమే పలుకేవాడుంటే, చివరకు అల్లాహ్ వద్ద అతని పేరు సత్యవాది అని వ్రాయబడుతుంది. మరియు అసత్యాలు పాపాలకు దారి చూపుతాయి. పాపాలు నరకానికి దారి చూపుతాయి. అలాగే ఆ వ్యక్తి అసత్యాలు పలుకుతూ ఉంటే, చివరకూ అల్లాహ్ వద్ద అతని పేరు అసత్యవాది అని వ్రాయబడుతుంది.[2]

## 2. తన విషయంలో కూడా సత్యానికి అనుగుణంగా ఉండాలి

ప్రతి ముస్లిం తన తప్పు ఒప్పులను, మంచి చెడులను గుర్తించాలి. తనను తాను మోసగించుకోకూడదు. ‘సత్యమేమ జయతే’ అన్న విషయం మరువకూడదు.

ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: “అనుమానంగా ఉన్న విషయాలను వదలీ అనుమానం లేని విషయాలను పాటించు. నిశ్చయంగా సత్యం సంతృప్తికి ప్రతి రూపం మరియు అసత్యం అనుమానానికి రూపం.”[3]

ప్రతి మనిషికి అధర్మం గురించి, అసత్యమైన దైవాల గురించి, మూఢ నమ్మకాల గురించి తెలుసు. అలాగే జూదం గురించి, మత్తుపానీయాల గురించి,

1. *(సహీహ్ ఇబ్ను ఖుజైమా, సహీహుల్ జామే:1353)*
2. *(సహీహ్ బుఖారీ:5629, సహీహ్ ముస్లిం:4721)*
3. *(సహీహ్ తిర్మిజీ: 2518)*

చెడు సహవాసం గురించి తెలుసు, దాని వలన వ్యక్తిగత జీవితం ఎంత పాడవుతుందనో కూడా తెలుసు. ప్రతీ వ్యక్తి మనసు అవన్నీ తప్పేనని అంగీకరించినప్పటికీ, తన తప్పులను ఒప్పులుగా భావించి మోసగించుకుంటున్నాడు. సత్యతబద్ధమైన జీవితానికి దూరమవుతున్నాడు.

## 3. సత్యాన్నే తమ జీవన శైలిగా చేసుకున్నవారి ఘనత

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: "వాస్తవంగా సత్యసంధులు, అల్లాహ్ ఎడల భయభక్తులు కలవారు వీరే."[1]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: "ఈ రోజు సత్యవంతులకు వారి సత్యం లాభాన్ని ఇస్తుంది, క్రింద కాలువలు ప్రవహించే ఉద్యానవనాలు వారికి లభిస్తాయి, అక్కడ వారు ఎల్లప్పుడు ఉంటారు. వారు అల్లాహ్ అంటే ఇష్టపడతారు. అల్లాహ్ వారంటే ఇష్టపడతాడు, ఇదే గొప్ప విజయం."[2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "వ్యాపారస్తులు తమ వ్యాపారంలో సత్యమైన బాటను పాటించి (ఆ సామాగ్రి మంచీ చెడులను గురించి విడమర్చి చెప్పి) వ్యాపారం చేస్తే వారి వ్యాపారంలో అల్లాహ్ శుభాలను ప్రసాదిస్తాడు."[3]

---

1. *(2,సూరతుల్ బఖరా:177)*
2. *(5,సూరతుల్ మాయిదా:119)*
3. *(సహీహ్ బుఖారీ:1972, సహీహ్ ముస్లిం:2825)*